



మంత్రి రోజమ్మ @పైసా వసూల్

'మహిళా మంత్రి రోజమ్మ సొంత పార్టీ మహిళా కౌన్సిలర్ వద్ద పదవికోసం రూ.40 లక్షలు తీసుకుని, పదవి ఇవ్వకపోగా, ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వమంటే ఇవ్వడంలేదని ప్రెస్‌మీట్ పెట్టి మరీ భువనేశ్వరి అనే కౌన్సిలరు చెబుతుంటే దానికి సమాధానం లేదు. వాళ్ల పార్టీలోని నాయకుల వద్దే శాసన సభ్యులు, మంత్రుల స్థాయిలో డబ్బులు వసూలుచేసి తినే పరిస్థితి ఉందంటే ఎంతగా దిగజారారో చెప్పాల్సిన పని లేదు. పదవులను అమ్ముకుంటున్న వీరికి ప్రజల వద్ద ఓట్లు అడిగే అర్హత లేదు. ఇక, వి.కోటలో సొంత పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులే ఏకంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును అడ్డుకున్నారు. తమకు నీళ్ల బిల్లులు చెల్లించాలని విన్నవిస్తే వారికి బిల్లులు ఎప్పుడు ఇస్తారో సమాధానం ఇవ్వకుండా ఆయన వెను తిరగడం ఈ ప్రభుత్వ తీరుకు నిదర్శనం. రాష్ట్రాన్ని పాలించడంతో అన్ని రకాలుగా జగన్ రెడ్డి విఫలమయ్యారు. ఆయన సోదరి షర్మిల కాంగ్రెస్‌లో చేరితే.. దానిని చంద్రబాబుకు, టీడీపీకి అన్వయించడం సరికాదు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా నట్టేట ముంచిన ప్రభుత్వం దేశంలోనే వైసీపీ తప్ప మరొకటి లేదు' అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. వి.కోట మండలం పి.కొత్తూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

- వి.కోట

మంత్రి రోజాను బర్తరఫ్ చేయాలి

'దళిత మహిళా కౌన్సిలర్‌కు మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని చెప్పి రూ.40 లక్షలకుపైగా దోచుకున్న రోజాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి. సీఎం జగన్‌కు దళితులపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కౌన్సిలర్ భువనేశ్వరికి న్యాయంచేయడంతో పాటు మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధితులకు అండగా నిలవాలి. మంత్రి రోజా అవినీతిని చూసి మహిళలు ఈసడించుకుంటున్నారు' అని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ ఆరోపించారు. పుత్తూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- పుత్తూరు అర్బన్



ఎప్పుడిస్తారు నీళ్ల బిల్లులు?

- మానాలు పోయాయి.. ఇక ప్రాణాలే మిగిలాయి
- ప్రభుత్వంపై సొంత పార్టీ నేతల ఆగ్రహం
- ఇలాగైతే ఎన్నికల్లో పరిస్థితి ఏంటని వైసీపీలో ఆందోళన
- పలమనేరు నియోజక వర్గంలోనే రూ.10.47 కోట్ల బకాయిలు

వి.కోట, జనవరి 24: 'ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నీళ్లు తోలాం. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చాం. ఇప్పటికీ మాకు బిల్లులు ఇవ్వలేదు. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందంటున్నారు. మాకు ఇంకెప్పుడు ఇస్తారు నీళ్లబిల్లులు' అంటూ వైసీపీకే చెందిన కుప్పం, పలమనేరు నియోజక వర్గాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నేతలు ప్రశ్నిస్తున్నారు. నాలుగున్నరేళ్లుగా బిల్లులివ్వని ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వి.కోటలో బుధవారం సొంత పార్టీవారే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. సొంత పార్టీ వారికే బిల్లులు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో తాము ఎలా సమాధానం చెప్పాలంటూ స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు. రెండు నియోజక వర్గాల్లో ఇవ్వాల్సిన రూ.20 కోట్లకు ఇలా ఇబ్బందిపెడితే మరి పంచాయతీల్లో చేసిన రూ.కోట్ల పనులకు బిలులు అందుతాయా అని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తామంతా ట్యాంకర్లు కొని గ్రామాలకు నీటి సరఫరా చేస్తే బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను ఎవరి దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదన్నారు. ట్రాక్టర్లకు రుణ కంతులు కట్టేందుకు కొందరు బంగారం తాకట్టు పెడితే.. మరికొందరు వాహనాలనే ఫైనాన్సు వారికి అప్పగించారంటూ ప్రస్తావించారు. ఈ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకుంటే తమ బిల్లుల మాటేమిటని పలువురు అంటున్నారు.



ప్రాణాలూ తీసేలా ఉందీ ప్రభుత్వం

నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. బంగారం తాకట్టుపెట్టినా అప్పులు తీరలేదు. ఇప్పుడేమో బిల్లుల ఊసే ఎత్తేవారు లేరు. ఎమ్మెల్యే దృష్టికి సమస్య చెబితే పట్టించుకోలేదు. ఇప్పుడు మంత్రికి సమస్య చెప్పాలంటే పోలీసులు అడ్డుతగులుతున్నారు. మేము గెలిపించిన మంత్రిని.. మేము నిలదీస్తే తప్పంటున్నారు. చేసిన అప్పులు తీర్చలేక మానాలు పోయాయి. ఇక మిగిలింది మా ప్రాణాలే..? సకాలంలో బిల్లులు ఇవ్వకుండా వాటినీ తీసేలా ఉంది ప్రభుత్వ తీరు.

- నాగరాజురెడ్డి, వైసీపీ నేత, బైసుకుప్పం, వి.కోట మండలం

బిల్లు అప్‌లోడ్ చేశాం

పలమనేరు నియోజక వర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి రూ.10.47 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. వి.కోట మండలం రూ.4.53 కోట్లు, బైరెడ్డిపల్లె, రూ.1.94 కోట్లు, పలమనేరు రూ.1.68 కోట్లు, పెద్దపంజాణి రూ.1.01 కోట్లు, గంగవరం రూ. 1.29 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయి.



మేమూ వైసీపీ వాళ్లమే.. పట్టించుకునే దిక్కేది?



నేను 2019 నుంచి 23 నెలలు నీళ్ల తోలితే మూడు నెలల బిల్లు వచ్చింది. మిగిలిన రూ.9.5 లక్షల కోసం మూడుసార్లు విజయవాడ వెళ్లినా అపాయింట్‌మెంట్ లేదు. మేము వైసీపీ వాళ్లమే. ఎమ్మెల్సీ భరత్ నుంచి మంత్రి పెద్దిరెడ్డి, సలహాదారు సజ్జల వరకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. విధిలేని పరిస్థితిలో రోడ్డు మీదకు వచ్చాం.

- మునస్వామి, బోయినపల్లె, శాంతిపురం మండలం



మంత్రితో మాట్లాడుతున్న బాధితులు

సొంత పార్టీ నుంచే మంత్రికి నిరసన సెగ

వి.కోటలో బుధవారం సొంత పార్టీ నుంచే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నిరసన సెగ తగిలింది. నీళ్ల బిల్లుల కోసం ఆయన కారును వైసీపీకి చెందిన మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నేతలు అడ్డుకున్నారు. నాలుగున్నరేళ్లుగా బిల్లులు ఇవ్వలేదని, ఎన్నిసార్లు చెప్పినా మంత్రి కూడా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్దిచెప్పబోయిన వైసీపీ నేతలు, పోలీసులపైనా మండిపడ్డారు. కారులోనే ఉన్న మంత్రి.. తనకు బిల్లులకు సంబంధించి టోకెన్లు ఇస్తే త్వరగా మంజూరు చేయిస్తానంటూ కుప్పం వెళ్లారు. తిరిగొచ్చే సమయంలోనూ మంత్రిని ఆపి మాట్లాడాలని కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు చెందిన.. నీళ్ల బిల్లులు రావాల్సిన వైసీపీ వారు దానమయ్యగారి పల్లె టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అడ్డుకోబోయిన పోలీసులతోనూ వీరు వాగ్వాదానికి దిగారు. వీరిని చూసి కారు దిగన మంత్రి పెద్దిరెడ్డి.. నీటి బిల్లులు అప్‌లోడ్ చేశారని, త్వరలో బకాయిలు విడుదల చేస్తామని చెప్పారు. ఈ పరిణామం ఎన్నికల నాటికి ఎలా ఉంటుందోనని స్థానిక వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వారికి

ఇంటి నుంచే ఓటు

- జిల్లాలో 42వేల మందికి అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా 80 ఏళ్లు పైబడిన వారికీ ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించారు. రెండేళ్ల కిందట కేరళలో జరిగిన ఎన్నికల్లో అమలు చేశారు. ఆ తర్వాత కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లోనూ ఈ అవకాశం కల్పించారు. ఇదే విధానం అన్ని ప్రాంతాల్లో అమలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేర జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. జిల్లాలో 80 ఏళ్లు దాటిన వృద్ధులు సుమారు 19,197 మంది ఉన్నారు. అలాగే, 22,862 మంది దివ్యాంగులు ఓటర్లుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా దాదాపు 42 వేల మందికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించనున్నారు. ఓటుహక్కు ఇంటినుంచి వినియోగించుకోవాలంటే 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. పోలింగ్‌కు ఒకట్రెండు రోజుల ముందు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి నేతృత్వంలో పోలింగ్ సిబ్బంది వీరి ఇళ్లకు వెళ్లి బ్యాలెట్ పత్రం ఇస్తారు. ఓటు వేసిన తర్వాత సీల్డ్ కవర్‌లో పెట్టి, తమతో తీసుకెళ్లిన బాక్సులో వేసే అవకాశం కల్పిస్తారు. రాజకీయ పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్లు కూడా వారి వెంట ఉంటారు. ఇంటి నుంచే ఓటు వినియోగించుకోదలచిన వారు ఎక్కువగా ఉంటే అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. ఒకవేళ వీరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేస్తామన్నా.. వేసే అవకాశం ఉంది. దీనిపై త్వరలో అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నారు.

నెలాఖరులోగా కరెంటు బిల్లులు కట్టండి

- లేదంటే నిలిపేస్తామంటూ పంచాయతీలకు నోటీసులు
- ఉమ్మడి జిల్లాలో రూ.1042 కోట్ల బకాయిలంటున్న విద్యుత్ శాఖ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: జిల్లాలో పంచాయతీల ఖాతాలకు ఈసారి 15వ ఆర్థికసంఘం నిధులు టైడ్, అన్‌టైడ్, వడ్డీ పైకం రూ.29.21 కోట్లు విడతల వారీగా జమయ్యాయి. గతంలో 13, 14 ఆర్థికసంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ బకాయిలకు జమచేసింది. ఈసారి పంచాయతీల్లో వీధిలైట్లు, తాగునీటి పథకాల మోటర్లు, విద్యుత్ వినియోగానికి సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1369 పంచాయతీల ద్వారా రూ.1042 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. దీనిపై సర్పంచులకు, కార్యదర్శులకు నోటీసులు జారీచేస్తున్నారు. ఈ నెలాఖరులోగా బకాయిలు చెల్లించకుంటే ఫిబ్రవరి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అందులో పేర్కొన్నారు. దాంతో సర్పంచులు ఆందోళనలకు గురవుతున్నారు. గతంలో పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. వాటిని పంచాయతీలు డ్రా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆయా బ్యాంకు ఖాతాలను ఖజానాశాఖ ద్వారా ఫ్రీజ్ చేసింది. తర్వాత విద్యుత్ బకాయిల పేరుతో గుట్టు చప్పుడు కాకుండా నిధులు మళ్లించింది. దీంతో పంచాయతీల నిర్వహణ పనులకు నిధులు లేక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. ఇప్పుడు మళ్లీ రూ.కోట్లలో విద్యుత్ బకాయిలు ఉన్నాయంటూ అధికారులు నోటీసులు జారీ చేస్తుండటంతో సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

చిరుద్యోగుల పట్ల చిన్నచూపు

- బలవంతంగానే సమ్మెకు తెరదించిన ప్రభుత్వం
- అంగన్వాడీ, సమగ్రశిక్ష, పారిశుధ్య కార్మికులకు మిగిలింది కంఠ శోషే

చిత్తూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఆందోళనకు దిగిన వివిధ శాఖల చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూపించింది. ఎన్నికల ముందు ఏ ప్రభుత్వమైనా ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందిస్తుంది. జగన్ సర్కారు మాత్రం మొండిగా వ్యవహరించింది. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, వాటిని అమలు చేయాలని కోరితే.. వారి ఉద్యోగాలను ఊడగొడతామని బెదిరించింది. అంగన్వాడీలు, సమగ్రశిక్ష, పురపాలక పారిశుధ్య కార్మికులు, కేజీబీవీ ఉద్యోగుల ఆశలేవీ తీరకుండానే ఆందోళనలకు తెరపడేలా చేసింది.

'తొలగింపు' పేరిట అంగన్వాడీలను బెదిరించి..

అంగన్వాడీలు, ఆయాల జీతాల పెంపు వంటి డిమాండ్లతో సుమారు 43 రోజుల పాటు విధులు బహిష్కరించి ఆందోళనలు చేశారు. తొలుత జిల్లాలోని 2380 అంగన్వాడీ టీచర్లు, 1795 మంది ఆయాలు సమ్మెను ప్రారంభించగా.. పుంగనూరు, కుప్పం, జీడీనెల్లూరు వంటి ప్రాంతాల్లో స్థానిక వైసీపీ నాయకుల బెదిరింపులతో విడతలవారీగా విధుల్లోకి చేరిపోయారు. సచివాలయ ఉద్యోగులతో కేంద్రాల తాళాలు పగులగొట్టి మరీ స్వాధీనం చేసుకున్నా పిల్లలు, బాలింతలు కేంద్రాలకు రాలేదు. ఎస్మా చట్టం పేరుతో ప్రభుత్వం అంగన్వాడీల్లో భయాందోళన కలిగించింది. షోకాజ్ నోటీసులను ఇచ్చింది. దీంతో మరికొందరు విధుల్లో చేరిపోయారు. మిగిలిన వారు ఆందోళనలు ఉధృతం చేయగా, వీరిని తొలగించి కొత్తవారిని తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇలా జిల్లాలో 836 మందిని తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 21వ తేదీ నుంచి అందరూ విధుల్లో చేరిపోయారు. అంగన్వాడీలతో ప్రభుత్వం ఆరుసార్లు చర్చలు జరిపినా ఫలితం లేదు. చివరికి జూలై నుంచి జీతాలు పెంచుతామని హామీనిచ్చి సమ్మెను విరమింపజేశారు.



కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్వాడీలు (ఫైల్ ఫొటో)

16 రోజుల చెత్త.. ఒకేసారి ఎత్తాల్సి వచ్చింది

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్‌తో పురపాలక సంఘాల్లో పారిశుధ్య కార్మికులు ఆందోళనలకు దిగారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా కార్మికులు 16 రోజుల పాటు ధర్నాలు, నిరసనలు చేశారు. దీంతో ఆయా పట్టణాల్లో చెత్త, మురుగు పేరుకుపోయింది. ప్రజలంతా ఇబ్బంది పడ్డారు. అక్కడక్కడా అధికారులు, సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు చెత్తను శుభ్రం చేయాల్సి వచ్చింది. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం దయ చూపుతుందని ఆశ పడ్డారు. తీరా పండుగకు ముందు చర్చల పేరుతో పిలిచి ఇప్పుడిస్తున్న జీతం రూ.15 వేలు, ఆరోగ్య భత్యం రూ.6 వేలు కలిపి ఒకే మొత్తంగా జీతం రూపంలో ఇస్తామని హామీనిచ్చి సమ్మె విరమింపజేశారు. నిరసనలు చేసినా ప్రభుత్వం నయాపైసా లబ్ధి కలిగించలేదని నిట్టూర్చారు. ఆయా ప్రాంతాల్లో ఇన్నాళ్లూ పేరుకుపోయిన చెత్తను మళ్లీ వాళ్లే శుభ్రం చేశారు.

ఉద్యోగులకు సమగ్ర 'శిక్ష'

విద్యాశాఖలోని సమగ్రశిక్ష పరిధిలో పనిచేస్తున్న 23 విభాగాల సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం విధుల్ని బహిష్కరించారు. జిల్లాలో సుమారు 635 మంది సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. వీరికి అదనంగా కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది కూడా సమ్మె చేశారు. వీరిలో కేజీబీవీ ఉద్యోగులతో చర్చలు జరిపిన సర్కారు వారి డిమాండ్లను తీర్చకుండానే తొలగింపు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వారంతా విధుల్లో చేరిపోయారు. సమగ్రశిక్ష సిబ్బంది ఆందోళనలు కొనసాగించినా కొన్నింటికే ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వారి ప్రధాన డిమాండ్ అయిన మినిమమ్ టైం స్కేల్‌పై కమిటీ వేస్తామని చెప్పింది. 18 రోజుల పాటు సమ్మె చేసినా సాధించిందేమీ లేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

కులగణనకు సర్వర్ డౌన్


చిన్నకలిగిరిలో రాత్రి 9 గంటలకు కూడా సర్వేలో సచివాలయ సిబ్బంది

పెనుమూరు, జనవరి 24: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జగన్ సర్కార్ కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వేలో వలంటీర్లను కీలకం చేస్తూ వారితో సచివాలయ ఉద్యోగులను జత చేసింది. ఆయా కుటుంబాల వివరాలను కులగణన యాప్‌లో పొందుపరిచి ఇంట్లో వారిచేత వేలిముద్రలు వేయిస్తున్నారు. 28వ తేదిలోపు ఈ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే ఈ సర్వే చేయడానికి సర్వర్ మొరాయించడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఉదయం 6 గంటలకు వచ్చి రాత్రి 10 వరకు చేస్తున్నారు. పగలు సర్వర్ పనిచేయకపోవడంతో రాత్రిపూట చేయాల్సి వస్తుందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. రాత్రిళ్లు ఇళ్ల వద్దకు వెళ్లడానికి కొందరు ఇబ్బంది పడుతున్నారు. అయినా సర్వే పూర్తి చేయాలని తప్పక వెళుతున్నారు. పెనుమూరు మండలంలో 13769 ఇళ్లకు గాను ఆరు రోజుల్లో 47 శాతం సర్వే జరిగింది.

ముందస్తుగా పీసీసీ అధ్యక్షురాలి పర్యటన

● 28న తిరుపతిలోనే ఉమ్మడి జిల్లా శ్రేణులతో సమావేశం

వెదురుకుప్పం, జనవరి 24: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటన ముందుకు మారినట్లు డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ బుధవారం తెలిపారు. ముందుగా ఈనెల 29వ తేది మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరులో సమావేశం ఉంటుందని ఖరారైందన్నారు. కానీ, మారిన షెడ్యూల్ మేరకు 28వ తేది ఉదయం 10 నుంచి 12 గంటల వరకు తిరుపతిలోనే ఉమ్మడి జిల్లా (చిత్తూరు, తిరుపతి జిల్లాల) కాంగ్రెస్ పార్టీ కేడర్‌తో వైఎస్ షర్మిల సమావేశమవుతారని చెప్పారు. ఈ మార్పును జిల్లాలోని పార్టీ శ్రేణులు గుర్తించి.. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల నిర్వహణ కమిటీలను నేటిలోగా ఏర్పాటు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24:సార్వత్రిక ఎన్నికల నిర్వహణకోసం ఎన్నికల కమిటీల ఏర్పాటును గురువారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ షన్మోహన్ సూచించారు. బుధవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంసీసీ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ కమిటీ, సర్వైలెన్స్ కమిటీ వీడియో వ్యూవింగ్ వంటి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు మండల, మున్సిపాలిటీల వారీగా కమిటీలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు డిప్యూటీ తహసీల్దార్ లేదా సీనియర్ ఆర్ఐ, ఏఎస్ఐ, వీడియో గ్రాఫర్, ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో కూడిన సిబ్బందిని నియమించాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, డీఈవో విజయేంద్రరావు, సర్వశిక్షా అభియాన్ ఆర్వో వెంకటరమణ, డీఎల్డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో జాతీయ ఓటర్ల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో గురువారం ఉదయం పది గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద విద్యార్థులచే మానవహారం, పురవీధుల్లో ర్యాలీ కొనసాగుతుంది. అనంతరం నాగయ్య కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ షన్మోహన్, ఇతర ముఖ్య అతిథుల ప్రసంగాలు, ప్రతిజ్ఞ, సీనియర్ సిటిజన్ల సన్మానం, కొత్తగా ఓటర్లుగా నమోదైన యువ ఓటర్లకు ఎపిక్ కార్డుల పంపిణీ జరుగుతాయి. ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఈఆర్వో, ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, బీఎల్వోలు, ఆపరేటర్లకు అవార్డుల ప్రదానం ఉంటుందని ఆర్డీవో జి.చిన్నయ్య తెలిపారు.

సచివాలయాల్లో వైసీపీ నేతల మీటింగులు

సిబ్బందికి, వలంటీర్లకు ఎన్నికల్లో ఎలా పనిచేయాలో పాఠాలు

ఏర్పేడు, జనవరి 24: సచివాలయాలను వైసీపీ నాయకులు పార్టీ ప్రచార కేంద్రాలుగా వాడుకుంటున్న వైనం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలో బుధవారం బయటపడింది. మండలంలో 19సచివాలయ కేంద్రాలుండగా వాటిలో 13కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు బుధవారం సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు వచ్చే ఎన్నికల్లో చేయాల్సిన పనుల గురించి సూచనలిచ్చారు.ఈ విషయాన్ని ఈవో పీఆర్డీ చెప్పినట్లుగా ముందురోజే ఓ పంచాయతీ అధికారి సచివాలయ డీడీవోలకు, వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపాడు. అంతే కాకుండా ఏ సచివాలయానికి ఎంత సమయానికి వైసీపీ నాయకులు వస్తారో కూడా తెలియపరిచాడు.ఆ సమయానికి వలంటీర్లతో సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని వాయిస్ మెసేజ్‌లో సూచించారు. అదే ప్రకారం బుధవారం వైసీపీ నాయకులు 13 సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎన్నికల్లో పనిచేయాల్సిన తీరును, ప్రజలకు చెప్పాల్సిన అంశాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఒక దగ్గర ఉంచాలని ఆదేశించి మరీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీకోసం పనిచేయకపోతే ఉద్యోగాలుండవని చెప్పినట్లు సమాచారం. ఈ ప్రచార కార్యక్రమాలను పార్టీ కార్యాలయాల్లో నిర్వహిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వైసీపీ నాయకులకు సూచించినట్లు తెలిసింది.

ఈ నిజం మీకు తెలుసా?

వన్నెకుల క్షత్రియులకు చంద్రబాబు చేసిన మేలుపై పోస్టర్లు ● ఎట్టకేలకు శిలాఫలకంపై చేరిన పేరు


చిన్నకురబలపల్లెలో పోస్టర్లతో ఊరేగింపు - చంద్రబాబు, కంచర్ల పేర్లు చేర్చి రూపొందించి శిలాఫలకం

కుప్పం, జనవరి 24: వన్నెకుల క్షత్రియులకు టీడీపీ చేసిందేమీలేదని వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవడానికి ఆ పార్టీ శ్రేణులు నడుం బిగించాయి. ప్రత్యేకించి వన్నెకుల క్షత్రియ కళ్యాణ మండపం పేరుతో మంత్రి పెద్దిరెడ్డి బుధవారం ప్రారంభించిన భవనం విషయంలో 'ఈ నిజం మీకు తెలుసా?' పేరుతో వాస్తవాలను వెల్లడించే పోస్టర్లను నేతలు రూపొందించారు. వన్నెకుల క్షత్రియ భవనానికి రూ.5 కోట్ల విలువైన భూమితోపాటు, రూ.2 కోట్ల కేటాయింపు చంద్రబాబే చేశారని అందులో పేర్కొన్నారు. భవన నిర్మాణం టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తయిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుంటే మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలని టీడీపీ ధర్నా చేసిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో హాస్టల్‌తో పాటు వన్నెకుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేసేది చంద్రబాబేనని పోస్టర్‌లో ముద్రించారు. 'మన కుల దైవం ధర్మరాజు సాక్షిగా ఇదే నిజం. అందుకే, లక్ష మెజారిటీతో చంద్రబాబు గారిని గెలిపించి మన రుణం తీర్చుకుందాం' అని ముక్తాయించారు. ఈ పోస్టర్లను కుప్పం మున్సిపాలిటీ లక్ష్మీపురంతోపాటు గ్రామగ్రామానా గోడలకు అంటించారు. చిన్నకురబలపల్లె తదితర గ్రామాలు, శాంతిపురం మండలం వడ్డిమానికొత్తూరు, సి.బండపల్లె తదితర గ్రామాలలో ఊరేగించారు. పోస్టర్లకు పాలాభిషేకాలు చేశారు. ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, నాయకులు పార్టీ కార్యకర్తలు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు ప్రారంభోత్సవ శిలాఫలకంపై తొలుత స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు పేరుతోపాటు తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ లేకపోవడంపై టీడీపీ శ్రేణులు ఫిర్యాదు చేయగా.. ప్రొటోకాల్ ప్రకారం ఆ పేర్లు చేర్చారు.

వైసీపీని సాగనంపడమే బీసీల లక్ష్యం

● చిత్తూరులోని 'జయహో బీసీ' సదస్సులో నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జనవరి 24: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే లక్ష్యమని బీసీ నేతలు చెప్పారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం 'జయహో బీసీ' సదస్సు జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 26 మందికిపైగా బీసీలు హత్యకు గురయ్యారని, 650 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధుల నుంచి సుమారు రూ.34 వేల కోట్లు మళ్లించారని ఆరోపించారు. బీసీలు, మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను స్థానిక వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని చెప్పారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. మాజీ మేయర్, నగర పార్టీ అధ్యక్షురాలు కటారి హేమలత మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో బీసీలకు స్వయం ఉపాధి రుణాలు, చేతి వృత్తులవారికి ఆదరణ పథకం కింద 90 శాతం రాయితీపై పరికరాలు అందించిందని గుర్తుచేశారు. బీసీలకు ఇచ్చిన నామినేటెడ్ పదవులు కేవలం అలంకారప్రాయంగానే ఉన్నాయన్నారు. బీసీ కార్పొరేషన్‌కు రూపాయి కూడా ప్రభుత్వం కేటాయించలేదని విమర్శించారు. బీసీలు బలహీనులు కాదని, వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్రకుమార్, కాజూరు బాలాజి, గురజాల జగన్మోహన్, బీసీ సంఘం నేతలు వెంకటేష్ యాదవ్, త్యాగరాజన్, షణ్ముగ రెడ్డి, సీఎం విజయ, ఈశ్వర్, శంకర్, రఘు, సుబ్రి, నిత్యానందం, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంపై రాళ్లదాడి

● నలుగురు దుండగులు, మోటారు సైకిళ్లు పోలీసులకు అప్పగింత


పోలీసు స్టేషన్‌లో ఉన్న దుండగుల ద్విచక్ర వాహనాలు - పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, ఎన్ఎస్‌పేట వాసులు

పుంగనూరు, జనవరి 24: పుంగనూరు ఎస్ఎస్‌పేట రాంనగర్ ఆంజనేయస్వామి ఆలయంపై మంగళవారం రాత్రి కొందరు రాళ్లు విసిరారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు చింపడంతో ఉద్రిక్తత నెలకొంది. దుండగులు రాళ్లు విసురుతున్న విషయం తెలుసుకుని స్థానికులు రావడంతో పలువురు పారిపోగా, నాలుగు ద్విచక్రవాహనాలు, నలుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు బుధవారం పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ధర్నా చేశారు. బీజేపీ కోఆర్డినేటర్ పూల ప్రేమ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో 50 మందికిపైగా ఆలయం వద్దకు వచ్చి ఫ్లెక్సీలు చింపి, రాళ్లు విసరడం దారుణమన్నారు. పట్టుబడిన ముబారక్‌ను విచారించగా తానే అందరినీ పిలిపించినట్లు చెప్పారని, రోషన్, జియాల్, మహ్మద్, లడ్డా తదితరులు వచ్చామని చెప్పారన్నారు. వారి వాహనాల్లో కత్తి, రాళ్లు, గంజాయి, మద్యం సీసాలు, పెట్రోల్, మారణాయుధాలు ఉన్నట్లు తెలిపారు. వీరు కోలార్, రామసముద్రం, స్థానిక బీడీకాలనీ, ఉబేదుల్లా కాంపౌండ్ ప్రాంతాల నుంచి వచ్చినట్లు తెలిపారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఏటిగడ్డపాళ్యంలోని దేవాలయంపై దాడుల ఘటనలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడంతో ప్రస్తుతం ఎన్ఎస్‌పేటలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించాలని డిమాండు చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న సీఐ రాఘవరెడ్డి ఆందోళనకారుల వద్దకు చేరుకుని జరిగిన విషయంపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో ఆలయ కమిటీ సభ్యుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్, నానబాల కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

పదవులు అమ్ముకునే రోజాకు మంత్రిగా కొనసాగే అర్హత లేదు

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శ

చిత్తూరు సిటీ, జనవరి 24: పదవులను అమ్ముకుంటున్న మంత్రి రోజాకు పదవిలో కొనసాగే అర్హత లేదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యక్రమంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత పార్టీ నాయకులకే రోజా పదవులు అమ్ముకోవడం దారుణమన్నారు. పుత్తూరు కౌన్సిలర్ భువనేశ్వరి మున్సిపల్ చైర్మన్ పదవికోసం తనవద్ద రూ.70 లక్షలు డిమాండ్ చేసి రూ.40 లక్షలు తీసుకున్నారని బహిరంగంగా చెప్పడమే వైసీపీ నేతల దోపిడీకి నిదర్శనమన్నారు. దళితులను వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. దళితులకు పదవులు కావాలంటే రోజాకు కప్పం కట్టాలా అని ప్రశ్నించారు. దళిత ద్రోహి సీఎం జగన్ అనడానికి ఇంతకంటే నిదర్శనం వేరొకటి లేదన్నారు. రోజా దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ తక్షణమే రోజాను బర్తరఫ్ చేయాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో నేతలు సురేంద్ర కుమార్, కటారి హేమలత, మోహన్‌రాజ్, రాణి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ఒక వర్గం రోజా ప్రతిష్టను దిగజారుస్తోంది

● పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24: నగరి నియోజకవర్గ వైసీపీలో ఒక వర్గం పనిగట్టుకుని మంత్రి రోజా ప్రతిష్టను దిగజారుస్తోందని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు.వైస్ చైర్మన్ శంకర్,కొందరు కౌన్సిలర్లతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రోజా రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక చేస్తున్న దుష్ప్రచారంలో భాగంగానే కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపణలు చేసిందన్నారు. సత్య అనే వ్యక్తి అప్పు తీసుకుంటే మంత్రికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఒక వర్గం చేస్తున్న కుట్రే ఇది అన్నారు. ఆ వర్గం పేర్లు చెప్పాలని విలేకరులు అడగ్గా నీళ్లు నమిలారు.కౌన్సిలరు భువనేశ్వరి వద్ద డబ్బు తీసుకున్న సత్య మాట్లాడుతూ తాను వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.29లక్షలు తీసుకున్నానని, ఇప్పటికే రూ.16లక్షలు చెల్లించానని, మిగిలిన బాకీ చెల్లించేలోపు మంత్రిపై అభాండాలు మోపారని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వాలకు దరఖాస్తు

చిత్తూరు రూరల్/వెదురుకుప్పం/జీడీనెల్లూరు, జనవరి 24: చిత్తూరు, గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాల కోసం ముగ్గురు దరఖాస్తు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని టిక్కీ రాయల్ కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మాణిక్యం ఠాగూర్‌ను కలిసి దరఖాస్తు అందజేశారు. అలాగే, జీడీనెల్లూరు అభ్యర్థిత్వం కోరం జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లికి చెందిన బి.రామస్వామి కుమారుడు బి.దొరస్వామి బుధవారం విజయవాడలో రాష్ట్ర వ్యవహారాల కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌కి దరఖాస్తు ఇచ్చారు. అనంతరం కేవీపీ రామచంద్రరావును కలసినట్లు ఆయన తెలిపారు. అలాగే, బాలకృష్ణాపురం దళితవాడకు చెందిన లాయర్ మణికృష్ణ కూడా జీడీనెల్లూరు నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం మాణిక్యం ఠాగూర్‌కు బయోడేటా అందజేశారు.

బీసీవై పార్టీకి చెరకు రైతు గుర్తు కేటాయింపు

పుంగనూరు, జనవరి 24: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీకి కామన్‌గా చెరకురైతు గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ బుధవారం రాత్రి తెలిపారు. ఈ ఎన్నికలకు బీసీవై పార్టీ పూర్తిగా సిద్ధమైందని, సంస్థాగత నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్లు వివరించారు. ఈనెల 31వ తేది మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో నియోజకవర్గాల కమిటీలు ప్రకటిస్తామని చెప్పారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను గుర్తించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల మంజూరు కోసం అనువైన స్థలాన్ని గుర్తించాలని, ఇందుకు రెవెన్యూ అధికారులు, మీడియా సభ్యులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టుల ఇళ్ల పట్టాల కమిటీ సమావేశం జరిగింది. ఇళ్ల స్థలాలకు 311 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖ ద్వారా త్వరితగతిన భూస్థలాల పరిశీలన ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అవసరమైన భూములను చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం, వి.కోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాల రెవెన్యూ అధికారులతో కమిటీ, ప్రెస్‌క్లబ్ సభ్యులు సమన్వయం చేసుకుని ఎఫ్ఎంబీలను తయారుచేయాలని చెప్పారు. డీఆర్వో రాజశేఖర్, సర్వేశాఖ అధికారి గౌస్ బాషా, ఆర్డీవో చిన్నయ్య, కమిటీ సభ్యులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం కారులో ఇరుక్కుని తిరుపతి కలెక్టర్ ప్రయాణం



తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో ఇండియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్-2024 కార్యక్రమానికి సీఎం జగన్ ముఖ్య అతిథిగా బుధవారం హాజరయ్యారు. రేణిగుంటలోని విమానాశ్రయం నుంచీ తిరుపతిలోని తాజ్ హోటల్‌కు జగన్ వచ్చేటపుడు, తిరిగి వెళ్ళేటపుడు కలెక్టర్ వెంకట్రమణారెడ్డి సీఎం కారులోనే ఇరుక్కుని కూర్చుని ప్రయాణించడం కనిపించింది. ముందు సీట్లో సీఎం కూర్చుని ఉండగా, వెనుక సీటులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ కూర్చున్నారు. కలెక్టర్ కూడా ప్రయాణించడంతో వెనుక సీట్లో ఇరుకైంది. దీంతో ఆయన టీటీడీ చైర్మన్, మంత్రి పెద్దిరెడ్డి ఒళ్ళో కూర్చున్న చందంగా ఇరుక్కుని ప్రయాణించడం కనిపించింది. సీఎం కాన్వాయ్‌లో పలు వాహనాలు అందుబాటులో వుండడంతో పాటు కలెక్టర్‌కు సొంత వాహనం కూడా వున్నప్పటికీ సీఎం కారులో అంతగా ఇరుక్కుని వెళ్ళాల్సిన అవసరమేమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. కాన్వాయ్‌లో ఈ దృశ్యం చూసిన వారంతా దీనిపైనే చర్చించుకోవడం కనిపించింది. అయితే తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్ర చేయడం, పలువురు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్న నేపథ్యంలో ప్రధానంగా ఆ అంశంపై సీఎం కారులో చర్చ జరిగివుంటుందన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

'సిద్ధం!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి

ఇంత భయమెందుకు?

● సీఎంను అడ్డుకుంటామని చెప్పకున్నా మమ్మల్ని గడపదాటనివ్వరా?

● టీడీపీ, జనసేన నేతల మండిపాటు


ఇంటిముందున్న పోలీసులతో సుగుణమ్మ వాగ్వాదం

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ తిరుపతి పర్యటనను అడ్డుకుంటామని ప్రతిపక్ష పార్టీలేవీ ప్రకటించకపోయినా నాయకులను గృహనిర్బంధంలో వుంచడం విమర్శలపాలైంది. బుధవారం తెల్లవారకముందే టీడీపీ, జనసేన నాయకుల ఇళ్లముందు పోలీసులు ప్రత్యక్షమయ్యారు. గడపదాటనీయకుండా కాపలాకాశారు. మీడియా సమావేశాలకు వెళ్లాలని మొత్తుకున్నా ఎస్కార్ట్‌లాగా వెంబడించారు. సాయంత్రం 4 గంటలపైన సీఎం పర్యటన ఉంటే ఉదయం 6 గంటలనుంచే ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేశారు. తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణతో పాటు జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజా రెడ్డిలను గృహనిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటలపైన సీఎం వెళ్లిపోయాకే విడిచిపెట్టారు.ఈ సందర్భంగా సుగుణమ్మ,ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ జగన్ రెడ్డిని అడ్డుకుంటామని తాము చెప్పనపుడు ప్రివెంటివ్ అరెస్టులు ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. తిరుపతిలో ప్రతిపక్షమే లేదని భూమన అభినయ్ రెడ్డి, ఇతర వైసీపీ నేతలు ప్రగల్భాలు పలుకుతుంటే తమ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులను ఎందుకు పంపారో అర్థం కావడంలేదన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనకు ఇదొక నిదర్శనమని మండిపడ్డారు.

● 'సిద్ధం.!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి...

ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం' అన్నట్టుగా జగన్మోహన్ రెడ్డి ఫొటోలతో పెద్దపెద్ద ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే తిరుపతి నగరమంతా పెట్టేశారు. ఫ్లెక్సీల్లో మాత్రం సిద్ధం.! అంటూ సవాల్ విసిరి, ప్రతిపక్షాలను గడపదాటనీయకుండా అడ్డుకున్నారు. 'ఆయనేమో సిద్ధం అంటూ వేలు చూపిస్తున్నాడు. మీరేమో మమ్మల్ని బయటకు రావొద్దు అంటున్నారు' అంటూ సుగుణమ్మ పోలీసులనుద్దేశించి చమత్కరించారు.

గ్రానైట్ లారీని ఢీకొన్న బైకు

● ఇద్దరు యువకుల దుర్మరణం


రోడ్డు పక్కన పడున్న మృతదేహాలు


పెనుమూరు, జనవరి 24: గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీని ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన పెనుమూరు మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీఆర్ జలాశయం సమీపంలో మఠంపల్లి వద్ద చిత్తూరుకు గ్రానైట్ లోడ్‌తో లారీ వెళుతుండగా ఎదురుగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ ఢీకొట్టారు. దీంతో ఆ ఇద్దరూ 30 అడుగుల దూరంలో ఎగిరి పడటంతో తలకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారించగా, ఆ ఇద్దరూ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే బీహారుకు చెందిన కూలీలుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


విజయ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, జనవరి24: పుంగనూరు-చిత్తూరు మార్గంలోని తోపు మఠం వద్ద ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. తోపుమఠానికి చెందిన మునెప్ప కుమారుడు విజయ్‌కుమార్ గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం తండ్రి మునెప్పతో కలసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో విద్యార్థి తలకు బలమైన గాయాలు తగిలి అక్కడక్కడే మృతి చెందాడు. సీఐ రాఘవరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అత్త, వదినపై కత్తితో దాడి


అత్త హురాన్, వదిన సల్మా

చిత్తూరు, జనవరి 24: చిత్తూరు నగరం శంకరయ్యగుంటలో బుధవారం రాత్రి జరిగిన దాడిలో హురాన్, సల్మా గాయపడ్డారు. టూటౌన్ సీఐ ఉలసప్ప తెలిపిన ప్రకారం.. నూర్ అనే వ్యక్తి ఓ చికెన్ షాపులో పని చేస్తూ తన భార్య హసీనాతో కలిసి శంకరయ్యగుంటలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి తనను భర్త కొడుతున్నాడంటూ హసీనా తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో హసీనా తల్లి, ఆమె పెద్ద కుమార్తె సల్మా వెళ్లి ఇద్దరిని విడిపించే ప్రయత్నం చేశారు. తన కుటుంబంలో గొడవ జరుగుతుంటే ఎందుకు అడ్డు వస్తున్నారంటూ ఆగ్రహించిన నూర్ కత్తి తీసుకుని అత్త, వదినపై దాడికి పాల్పడ్డాడు. వారిద్దరి గొంతు వద్ద తెగడంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు కోలుకుంటుండగా... సల్మా హోంగార్డుగా పనిచేస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి ఆశ వర్కర్..


మృతిచెందిన జయమ్మ

పుంగనూరు రూరల్, జనవరి24: పుంగనూరు మండలం సుగాలిమిట్ట క్రాస్‌లో ఆటో బోల్తాపడటంతో నేతిగుట్లపల్లె ఆశ వర్కరు జయమ్మ బుధవారం మృతిచెందారు. నేతిగుట్లపల్లెకు చెందిన ఆటో యజమాని బాబు, అతడి భార్య, ఆశ వర్కరు అయిన జయమ్మ కలసి మంగళవారం మండలంలోని వనమలదిన్నెలో బంధువుల ఇంటికి సంక్రాంతి పండుగకు వెళ్లారు. తిరిగి రాత్రి సొంత ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా సుగాలిమిట్ట క్రాస్ పత్రపల్లె రోడ్డువద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జయమ్మ తీవ్రంగా గాయపడగా, బాబుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతి చెందగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దానధర్మాలతో ఆధ్యాత్మికత పెంచుకోవాలి

- ఇస్తిమాలో మతగురువుల బోధన



ఇస్తిమాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పుంగనూరు, జనవరి 24: ప్రతి ముస్లిం దానధర్మాలతో ఆధ్యాత్మికత పెంపొందించుకుంటూ మహ్మద్ ప్రవక్త ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పలువురు మత గురువులు వివరించారు. బుధవారం పుంగనూరు బైపాస్ రోడ్డులోని రాగానిపల్లె వద్ద ఇస్తిమా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు మతగురువులు అక్బర్ షరీఫ్, మౌలానా ఫరూక్‌సాహెబ్, ముఫ్తీఅస్లాంసాహెబ్, ఎంఎస్.సర్దార్‌సాహెబ్ తదితరులు ప్రార్థనలు నిర్వహించి ధార్మిక ఉపన్యాసాలు చేశారు. భక్తి భావాలతో మెలిగినప్పుడే జీవితానికి అర్థం ఉంటుందని, నిత్యం ఖురాన్ పఠించి నమాజ్ చేయాలని పిలుపునిచ్చారు. ఖురాన్‌లోని సూక్తులను తెలియజేసి వాటిని విధిగా ఆచరించాలని సూచించారు. నమాజ్ చేయడం వల్ల ఐశ్వర్యవంతులు, ఆరోగ్యవంతులుగా జీవించగలరని చెప్పారు. ఇస్తిమాకు పుంగనూరు, రామసముద్రం, సోమల, పెద్దఉప్పరపల్లె, చౌడేపల్లె, కురబలకోట, మదనపల్లె, పెద్దపంజాణి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం మైనార్టీలు తరలివచ్చారు.

కోలాహలంగా ఎద్దుల పండుగ



శాంతిపురం, జనవరి 24 : తుమ్మిశి పంచాయతీ దుంకుమానుపల్లెలో బుధవారం ఎద్దుల పండుగ కోలాహలంగా జరిగింది. ఉదయం పశువులను శుభ్రపరిచి రంగురంగుల కాగితాలతో అలంకరించారు. అంతకు ముందు గ్రామ దేవతలకు పొంగుళ్ళు పెట్టి పూజలు చేశారు. ప్రధాన వీధిలో సంప్రదాయబద్ధంగా పూజలు చేసి ఎద్దులను పరుగెత్తించారు. ఒక ఎద్దు పరిగెత్తుతూ పాడుబడిన బావిలో పడగా స్థానికులు సురక్షితంగా బయటకు లాగారు. ఎద్దులకు పండుగ నిర్వహకులు బహుమతులు ప్రదానం చేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు శెట్టిపల్లె విద్యార్థిని ఎంపిక

శాంతిపురం, జనవరి 24 : మండల పరిధిలోని శెట్టిపల్లె ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న వైష్ణవి ఎన్ఎంఎంఎస్ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య తెలిపారు. గత నెల క్రితం ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు పాఠశాల నుండి సుమారు 10 మంది విద్యార్థులు హజరై పరీక్షలు రాశారు. మంగళవారం విడదలైన ఫలితాల్లో వైష్ణవి మంచి మార్కులు సాధించి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందిని ఆయన తెలిపారు. వైష్ణవి తండ్రి అనెకర మునిరత్నంను బుధవారం పాఠశాలకు పిలిపించి ఆయనను, విద్యార్థిని వైష్ణవిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఎన్ఎంఎంఎస్ ద్వారా సంవత్సరానికి స్కాలర్‌షిప్ రూ.12,000 చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు విద్యార్థికి అందిస్తారని హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, వెంకటరమణ, భార్గవి, కుసుమకుమారి, పద్మవతి, నాగభూష్ణం, విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండరు ఆవిష్కరణ



పుంగనూరు రూరల్, జనవరి24: పుంగనూరు బాలికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు జీవి. రమణ, హెచ్ఎం రుద్రాణి పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపర్ణ, గీతాంజలి, అనురాధ, తనుజ, లతశ్రీ, విశాలక్ష్మి, ముత్యాలు, సుజాత, భూదేవి, గాయిత్రి, జీవలత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక



కరీష్మా, గౌరీశశిధర్

పుంగనూరు రూరల్, జనవరి24: జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థులు ఎంపికైనట్లు జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రుద్రాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ డిసెంబరు 3వ తేదీన పలమనేరులో నిర్వహించిన పరీక్షల్లో కరీష్మా ఎంపికైనట్లు తెలిపారు. అలాగే అడవినాథునికుంట మోడల్ స్కూల్ నుంచి గౌరీశశిధర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు.

టీడీపీ ద్వారా తానెలాంటి పదవి పొందలేదు

పుంగనూరు, జనవరి24: టీడీపీ ద్వారా తాను ఎలాంటి పదవి పొందలేదని పుంగనూరు అంజుమాన్ కమిటీ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ సలీం పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓటింగ్ పద్ధతి ద్వారా అంజమన్ కమిటీకి ఎన్నికయ్యానన్నారు. తనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చారని, తద్వారా మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. తనపై టీడీపీ నాయకుడు సుహేల్‌బాషా ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

పుంగనూరు రూరల్, జనవరి 24: పుంగనూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. బుధవారం మండలంలోని ఏతూరు సమీపంలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పుంగనూరు మం డల ప్రత్యేకాధికారి మధుసూదన్, చౌడేపల్లె మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, పుంగనూరు ఏవో రాజేశ్వరి, సదుం ఎంపీడీవో వరప్రసాద్, వ్యాయమాధికారులు పాల్గొన్నారు.

పుంగనూరు ఎస్ఐ సుకుమార్‌కు సీఐగా పదోన్నతి

పుంగనూరు రూరల్, జనవరి 24: పుంగనూరు సబ్ ఇన్‌స్పెక్టర్ సుకుమార్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆయన ఎస్ఐగా మదనపల్లె, తిరుపతి, పుంగనూరు ప్రాంతాల్లో పని చేశారు.

పలమనేరుకు పల్లెవెలుగు బస్సులే దిక్కు

ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందితో అధికారుల చెలగాటం - పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు



బస్టాండులో నిలిచి ఉన్న పల్లె వెలుగు బస్సులు

పలమనేరు, జనవరి24 : పలమనేరు ఆర్టీసీ డిపో పరిస్థితి రానురాను అధ్వానంగా మారింది. ఇక్కడ నాలుగు దశాబ్దాల క్రితం ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసింది. పలమనేరు డిపో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కలెక్షన్లలోనూ, అత్యధిక కేఎంపీఎల్ సాధించడంతో పాటు ప్రయాణికులకు మెరగైన సేవలు అందిస్తుండేది. అయితే దశాబ్దకాలంగా ఈ డిపో గురించి పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. ఇక్కడి నుంచి నడుస్తున్న విజయవాడ, శ్రీహరికోట, నెల్లూరు, బెంగళూరు, తిరుమల, హైదరాబాదు సర్వీసులను క్రమేపీ నిలిపి వేశారు. ఈ సర్వీసులను జిల్లాలోని పొరుగు డిపోలకు బదిలీ చేసేశారు. ఆటుపిమ్మట కుప్పం డిపో ఏర్పడడంతో అక్కడికి కొన్ని సర్వీసులు బదిలీ చేశారు. రెండేళ్లక్రితం పుంగనూరులో డిపోను ప్రారంభించారు. దీంతో ఇక్కడినుంచి పుంగూరు వైపు నడుస్తున్న బస్సులతోపాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఆ డిపోకు బదిలీ చేశారు. అంతే కాక పలమనేరు డిపోకు మంచి ఆదాయాన్ని తీసుకు వస్తున్న చిత్తూరు-మదనపల్లి మార్గంలోని లైటినింగ్ సర్వీలన్నింటినీ చిత్తూరు, మదనపల్లి డిపోలకు పంపేశారు. ఇక మిగిలింది నామమాత్రం సర్వీసులే. నేడు పలమనేరు డిపోలో నడుస్తున్న బస్సులన్నీ పల్లెవె లుగు పేరుతో నడుస్తున్న డొక్కు బస్సులే. ఈ డొక్కు బస్సులు చూస్తేనే ప్రయాణికులు జడుసుకుంటున్నారు. ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి. ఈ బస్సులలో డ్యూటీలు చేయడం డ్రైవర్, కండెక్టర్లకు కత్తిమీద సాములా తయారైంది. కాలం చెల్లిన బస్సులను నడపడం చాలా కష్టమని డ్రైవర్లు అంటున్నారు. కాలం చెల్లిన బస్సులను నడుపుతున్నా రవాణా శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. అలాగే డిపోలో బస్సుల దుస్థితి రోజురోజుకు దిగజారి పోతున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

అక్రమ మద్యం, గంజాయి విక్రయాలు అరికట్టాలి



మండల మీట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు

కల్లూరు, జనవరి 24: పులిచెర్ల మండలంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ మద్యం, గంజాయి విక్రయాలను తక్షణం అరికట్టాలని జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఎస్ఈబీ అధికారులను కోరారు. పులిచెర్లలో బుధవారం ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్ఈబీ సిబ్బంది అమ్మాజీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్‌షాపులు ఉంటే ప్రజాప్రతినిధులు సమాచారం ఇవ్వాలని కోరారు. దీంతో జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి కలుగజేసుకుని బెల్ట్‌షాపులపై ప్రజాప్రతినిధులు సమాచారం ఇస్తేనే చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. గ్రామాల్లో గంజాయి, బెల్ట్‌షాపులు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, సంబంధితశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఫలితాలపై ఎంఈఓ శిద్ద రామయ్య మాట్లాడుతుండగా మళ్లీ మురళీమోహన్‌రెడ్డి కలగజేసుకుని పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆటస్థలం లేదని, కనీసం 6 ఎకరాల స్థలం కావాలన్నారు. పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక సుమారు 32 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం ఆవుతోందని మండల మీట్‌దృష్టికి తీసుకెళ్లారు. మంగళంపేట, నన్నూరివారిపల్లి, రాయవారిపల్లి సర్పంచ్‌లు మధు, వాసుదేవరెడ్డి, మునిరత్నం మాట్లాడుతూ పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్య ఉండటంతో వీధిదీపాల ఏర్పాటుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

బాలికల పట్ల వివక్షను రూపుమాపాలి



దాతలు అందించిన పుస్తకాలతో విద్యార్థినులు

పలమనేరు, జనవరి24 : నేటికీ కొన్నిచోట్ల బాలికల పట్ల వివక్ష కొనసాగుతోందని, దీన్ని అధిగమించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు అన్నారు. పలమనేరు బీసీ బాలికల వసతిగృహంలో బుధవారం బాలికాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులకు పలురకాల పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బాలిక విద్యావంతురాలు అయినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారిణి మీనాక్షి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ అధికారుల బుధవారం మండలంలోని పుదిపట్ల హైస్కూల్‌లో విద్యార్థులకు సీడీపీవో రాజేశ్వరిదేవి సాఫ్ట్ టచ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సులోచన, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల : రొంపిచెర్ల కస్తూర్బా విద్యాలయంలో బుధవారం బాలికల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎన్నారై దేవులపల్లి వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు ఆటలు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. దేవులపల్లి చంద్రశేఖర రెడ్డి జ్ఞాపకార్థం పాఠశాలకు ల్యాప్‌ట్యాప్ అంజేశారు. పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.పదివేలు నగదు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోసా కార్యదర్శి వెంకట్రమణారెడ్డి, బర్డ్ సంస్థ అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనులపండుగలా శ్రీరాముడి శోభాయాత్ర



పలమనేరు పురవీధుల్లో శ్రీరాముడి శోభాయాత్ర, వివిధ వేషధారణలతో పిల్లలు

పలమనేరు, జనవరి 24 : పలమనేరులో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయేవరకు పురవీధుల్లో శ్రీరాముడి శోభాయాత్ర కనులపండుగలా సాగింది. పట్టణంలోని మధుకళాశాల నుంచి భారీ శ్రీరాముడి ప్రతిమను ట్రాక్టరుపై అలంకరించి పూజలు నిర్వహించగా యాత్ర ప్రారంభమైంది. బ్యాండుమేళాలు, నయాండి డ్యాన్సులతో పాటు వందలాది మంది పురవీధుల్లో జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ పాల్గొన్నారు.కాషాయ దుస్తులతో , కాషాయ కండువాలతో యాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో అధిక సంఖ్యలో మహిళలు, వివిధ వేషధారణలతో చిన్నపిల్లలు పాల్గొన్నారు.

చల్లాబాబుతో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి భేటీ

రొంపిచెర్ల, జనవరి 24: పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. రొంపిచెర్లలోని చల్లాబాబు ఇంటికి ఆయన రాగా ఇరువురు నియోజకవర్గ రాజకీయాలు చర్చించుకున్నారు. అనంతరం పీలేరులో ఈనెల 27వతేదీ జరిగే రా కదిలిరా కార్యక్రమం కోసం ఏర్పాటు చేస్తున్న సభాస్థలం పనులను పరిశీలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వృద్ధుడి మృతి



చౌడేపల్లె, జనవరి24: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం చౌడేపల్లె మండలంలో జరిగింది. చిట్రెడ్డిపల్లెకు చెందిన సీతన్న(65) సొంత పనుల నిమిత్తం శెట్టిపేటకు తన ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి వస్తూ తన గ్రామ సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈప్రమాదంలో సీతన్న అక్కడిక్కడే మృతిచెందాడు.

వైసీపీలో పలువురి చేరిక

రామకుప్పం, జనవరి 24: రామకుప్పం పట్టణానికి చెందిన పలువురు యువకులు వైసీపీలో చేరారు. బుధవారం కుప్పం పర్యటనకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో వారికి కుండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి, ప్రజారకార్యదర్శి కేశవరెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు టీడీపీ ఆర్థికసాయం

రామకుప్పం/శాంతిపురం, జనవరి 24: రామకుప్పం మండలం కృష్ణాపురం, ఆవులకుప్పానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బత్తెప్ప, కోతుల వెంకటేశప్ప, బగలనత్తంకు చెందిన మాజీ సర్పంచు గోవిందన్ తల్లి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజినేయరెడ్డి, నాగభూషణం, జయశంకర్, వెంకటాచలం, పెరుమాళ్. సత్తి, హనుమంతు తదితరులు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారు మృతుల కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అలాగే శాంతిపురం మండలం మాదనపల్లె గ్రామానికి చెందిన బజినేటి వెంకటప్ప మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం టీడీపీ నేతలు పెద్దన్న, పురుషోత్తం, దొరస్వామి, బీరేష, చంద్ర, కృష్ణప్ప. మంజునాథ్, బాలకృష్ణ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. మట్టికర్చులకు పార్టీ తరఫున రూ.10 వేలు అందించారు.

కుప్పం మున్సిపల్ పరిధిలో...

కుప్పం, జనవరి 24: కుప్పం పురపాలక సంఘం పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు టీడీపీ తరఫున ఆ పార్టీ నాయకులు బుధవారం రూ.10 వేల వంతున ఆర్థికసాయం అందించారు. మృతులు సంజయ్, రాజమ్మ, శారదమ్మ, శరవణ కుటుంబాలను టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పరామర్శించారు. అలాగే కుప్పం కొత్తపేటలో నివాసం ఉండే అన్నదమ్ములు రంగస్వామి, గోవిందసామిలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు కన్నన్, మైనారిటీ నాయకుడు అన్సర్ బాషా పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

తోటకనుమలో 'ఇంటింటికీ తెలుగుదేశం'



తోటకనుమలో పర్యటిస్తున్న అమరనాథరెడ్డి

వి.కోట, జనవరి 24: వి.కోట మండలం తోటకనుమలో బుధవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా నట్టేన ముంచిన ప్రభుత్వం దేశంలోనే వైసీపీ తప్పా వేరే ప్రభుత్వం లేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, చౌడప్ప, నేతలు ధీరజ్, శబరీష్, విశ్వనాథ్, నాగభూషణం, రామూర్తి, రామచంద్ర, సుకన్య, శివకుమారి, షేక్ ఉమ్మర్, రుహుల్లా, చంద్రారెడ్డి, గుణ, దినేష్, నవమోహన్, బాలసుందరం, నంద, రవి, నరేష్, బహదూర్, నారాయణస్వామి, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



శాంతిపురం, జనవరి 24: మండల పరిధిలోని వడ్డివానికొత్తూరు, సి.బండపల్లె, నడింపల్లె గ్రామాల వద్ద బుధవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి వన్నెకుల క్షత్రియులు పాలాభిషేకం చేశారు. అనంతరం సి.బండపల్లె నామాలప్ప, నడింపల్లె సర్పంచ్ బాలకృష్ణ, వన్నెకుల సంఘం మండల అధ్యక్షుడు గోవిందరాజులు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ వన్నెకులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కుల సంఘం సభ్యులు సుబ్రమణ్యం, నాగరాజు, బాలకృష్ణ, గోపాల్, మునివెంకటప్ప, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు త్వరలో నష్టపరిహారం

కల్లూరు, జనవరి 24: ఏనుగుల దాడుల్లో పంటలను కోల్పోయిన బాధిత రైతులకు ఫిబ్రవరి మొదటి వారంలోపు నష్ట పరిహారం చెల్లిస్తామని డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. ఏనుగు దాడుల్లో పంటలను కోల్పోయిన బాధిత రైతులతో డీఎఫ్ఓ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ థామస్‌కుమార్, ఎఫ్ఎస్ఓ చైతన్య, ఎఫ్‌బీఓ నిఖిల్, ఏబీఓలు కృష్ణమూర్తి, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియ సామాజిక భవనం ప్రారంభం



గుడుపల్లె, జనవరి 24: మండలంలోని గుత్తార్లపల్లె సమీపంలో వన్నెకుల క్షత్రియ సామాజిక భవనాన్ని బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం సామాజిక భవనం ఎదుట మొక్కను నాటారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణం, భరత్, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంఘం చైర్మన్ వనితాశీను, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, కన్వీనర్ మురుగేష్, జడ్పీటీసీ కృష్ణమూర్తి, ఎంపీపీలు అశ్విని, వరలక్ష్మి, వేణుగోపాల్, మునిరత్నం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.50వేలు విరాళం

చౌడేపల్లె, జనవరి24: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంల వద్ద భక్తుల అన్నదానం కోసం అమ్మవారి భ క్తులు రూ.50వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ..పొద్దుటూరుకు చెందిన నారాయణరెడ్డి, కళావతిలు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. వీరికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు.

క్రీడా విజేతలకు బహుమతులు

పలమనేరు, జనవరి24 : పలమనేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో పలమనేరు రూరల్ జట్టు, మహిళల విభాగంలో బైరెడ్డిపల్లి జట్టు విజయం సాధించాయి. వీరందరికి ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్, ఎంపీడీఓ విద్యాసాగర్, తహసీల్దార్ కుప్పస్వామి, కమిషనర్ కిరణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



రొంపిచెర్ల, జనవరి 24: రొంపిచెర్ల బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఎస్టీయూ డైరీ, క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యక్షుడు లోకనాథరెడ్డి, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు పోలిరెడ్డి రమణారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, నాయకులు నవాజ్, రవిశేఖర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, ఇరాన్, లక్ష్మిదేవి, సదాశివరెడ్డి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జయహో బీసీ సభ

శాంతిపురం, జనవరి 24 : శాంతిపురంలో శుక్రవారం జయహో బీసీ సభ నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు శరవణకుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పిఎస్ మునిరత్నం, కన్వీనర్ చంద్రశేఖర్ హాజరవుతారని ఆయన తెలిపారు.

నూతన జంటకు టీడీపీ పెళ్లి కానుక

శాంతిపురం, జనవరి 24 : కడపల్లె పంచాయతీ కదిరిఓబునపల్లెలో నూతన జంటకు టీడీపీ నేతలు పెళ్లి కానుకను అందించారు. ఆ గ్రామంలోని వేలు కుమార్తె కృష్ణవేణికి, సేలం గ్రామానికి చెందిన మను(మనోహర్)కు గత ఆదివారం తమిళనాడులోని వానియంబాడి పెళ్లి జరిగింది. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల ప్రకారం బుధవారం జిల్లా పార్లమెంట్ వన్నెకుల క్షత్రియ సాధికారిక కమిటీ ఉపాధ్యక్షుడు కనమలదొడ్డి మణి, మాజీ సర్పంచ్ పురుషోత్తం, కడపల్లె పంచాయతీ యూనిట్ ఇన్‌చార్జి పెద్దన్న, దొరస్వామి, బీరేష్, బాలకృష్ణ, ఆశోక్ తదితరులు పట్టువస్త్రాలు అందించారు.

శాంతిపురం తహసీల్దార్‌గా కృష్ణకుమార్ బాధ్యతల స్వీకరణ



శాంతిపురం, జనవరి 24 : శాంతిపురం మండల తహసీల్దార్‌గా కృష్ణకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు రెవెన్యూ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న నరసింహులును పదోన్నతి కల్పించి శాంతిపురానికి బదిలీ చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి తట్టుకోలేక కేవలం నెల వ్యవధిలోనే ఆయన సెలవు పెట్టి వెళ్లిపోయారు. తరువాత డీటీగా ఉన్న కౌలేష్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కుప్పం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణకుమార్ శాంతిపురం తహసీల్దార్‌గా కలెక్టర్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ద్విచక్రవాహనం బోల్తా

యువకుడికి గాయాలు

సోమల, జనవరి 24: సోమల నుంచి కలకడకు ద్విచక్ర వాహనంలో పోతున్న యువకుడు తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కలకడకు చెందిన దయానంద (42) సొంత పనులపై నంజంపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి పోతుండగా తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద పశువులు అడ్డు రావడంతో వాటిని తప్పించపోయి అదుపు తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న రైతులు ఆ వ్యక్తిని ఆటోలో సోమల ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు కల్పించి కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు.

పాఠశాలల తనిఖీ

సోమల, జనవరి 24: సోమల పాఠశాలలో బుధవారం ఎంఈవో శ్రీరాములు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించి వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అలాగే ఎంఈవో-2 శివరత్న ఇరికిపెంట పంచాయతీలోని పలు బడులను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను, నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు సోమశేఖర్, అరుణ, హెచ్‌ఎంలు ఎల్లయ్య, రామ్మోహన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

సోమల, జనవరి 24: పౌష్టికాహారంతో రక్తహీనత దూరం చేసుకోవచ్చునని సోమల ఎంపీహెచ్‌ఈవో అమరనాథ్ సూచించారు. బుధవారం చిన్న సోమల పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు జరిపి ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న నర్సులు, సిబ్బంది

చిత్తూరు రూరల్, జనవరి 24: ఏపీ వైద్యవిధాన పరిషత్‌లో ఏరియా, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్సులు, పారామెడికల్, క్లాస్‌ఫోర్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎదుట సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, 2019 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ద్రవ్య ప్రయోజన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే 2 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ జీతాలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జయచంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు పెరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను కమిషనర్ అరుణ బుధవారం పరిశీలించారు. పెరేడ్ మైదానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులు చేస్తున్న పనులను తనిఖీ చేసి సూచనలు అందించారు. పెయింటింగ్, మొబైల్ మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలన్నారు. మైదానలో శుభ్రత పనులను పకడ్బందీగా చేపట్టాలని ప్రజారోగ్యం అధికారులను ఆదేశించారు. పెరేడ్ మైదానంతో పాటు పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో లోకేష్, డీఈలు వెంకటప్రసాద్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 24: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో ఏపీ కళాశాల విద్యాశాఖ, మహాత్మాగాంధీ శాంతి, సుస్థిరాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకులు ప్రతి విద్యార్థి ప్రవర్తనపై అవగాహన పెంచుకుని వారిని సమాజానికి ఉపయోగపడేలా నైతిక విలువలతో పాటు మానసిక స్థైర్యం పెంచాల్సి ఉందన్నారు. విద్యతో పాటు సమాజంలో వారు ఎంపిక చేసుకున్న రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సీ సమన్వయకర్త జయచంద్రుడు, రామమూర్తి, శ్రీనివాసులు, పద్మావతి, నోడల్ రిసోర్స్ కేంద్రం పరిధిలోని కుప్పం, పలమనేరు, పాకాల, చిత్తూరు, వెదురుకుప్పం కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పాలనకు అంతిమ ఘడియలు: టీడీపీ

పాలసముద్రం, జనవరి 24: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ రాక్షస పాలనకు అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయని, రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే అని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి ఎం. వాసు నాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎస్ఆర్ఆర్ కండ్రిగ పంచాయతీలోని గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు వెంకటేశులు, ఏయుమలై, చెంగమ నాయుడు, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం: పీటర్

గుడిపాల, జనవరి 24: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో రాష్ట్రంలో 150 స్థానాలు కైవసం చేసుకుంటుందని చిత్తూరు పార్లమెంటు ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని, ఆయన పాలనలో దళితులపై దాడులు, అక్రమ కేసులు, హత్యలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలతో పాటు ఉద్యోగస్తులను కూడా ఎన్నో ఇబ్బందులకు గురి చేశారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తారని జోస్యం చెప్పారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండు

నగరి, జనవరి 24: నగరి పట్టణ పరిధిలో మంగళవారం రాత్రి జి. అరుణ్ కుమార్(32) అనే యువకుడు ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టి ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ నిందితుడికి 15 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని పోలీసులు చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

మునిలక్ష్మమ్మ మృతికి పలువురి నివాళి


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రి రోజా

కార్వేటినగరం, జనవరి 24: కార్వేటినగరం మండలం సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన సినిమా డైరెక్టర్ ఆకుల శివ తల్లి మునిలక్ష్మమ్మ మృతికి సినిమా ప్రముఖులు, రాష్ట్ర మంత్రులు ఘన నివాళి అర్పించారు. బుధవారం మునిలక్ష్మమ్మ కర్మక్రియల కార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా, డైరెక్టర్ వీవీ వినాయక్‌లు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

9మంది ఎస్ఐలకు పదోన్నతులు

చిత్తూరు, జనవరి 24: జిల్లాలో తొమ్మిది మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో చిత్తూరు టూటౌన్ ఎస్ఐ నాగరాజు, చిత్తూరు క్రైమ్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు, యాదమరి ఎస్ఐ మునస్వామి, పూతలపట్టు ఎస్ఐ రామ్‌భూపాల్, ఎస్‌బీ ఎస్ఐ మనోహర్, కార్వేటినగరం ఎస్ఐ దస్తగిరి, డీటీసీ ఎస్ఐ రామకృష్ణయ్య, కార్వేటినగరం ఎస్ఐ సుకుమార్, పాలసముద్రం ఎస్ఐ ప్రసాద్‌లు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

గుడిపాల, జనవరి 24: మండలంలోని 197 రామాపురం గ్రామ పంచాయతీలో బెంగళూరుకు చెందిన వైదేహీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎల్ఐసీ హరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, జబ్బులున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైదేహి ఆస్పత్రి వైద్యాధికారులు, నిర్వాహకులు లోకేష్, శేఖర్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆత్మీయ సమావేశం

చిత్తూరు, జనవరి 24: చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి బుధవారం 39, 40, 41, 42 డివిజన్లకు సంబంధించి గాంధీరోడ్డులో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన్ను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కార్పొరేటర్లు గణేష్, వెంకట్, శశికుమార్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేతలు దినేష్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడే వాహనాల వేలం

బంగారుపాళ్యం, జనవరి 24: వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు సీఐ నాగరాజ రావు తెలిపారు. ఇందులో నాలుగు మోటర్ సైకిళ్లు, ఒక కారును వేలం వేయనున్నారు. ఆసక్తి గలవారు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఉదయం 10 గంటల లోపు ప్రవేశ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

మంగళపల్లి సర్పంచ్‌కు సన్మానం


కుప్పాల మురళిని సన్మానిస్తున్న బాబు రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, జనవరి 24: విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం రాష్ట్ర సర్పంచుల సంఘం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని మంగళపల్లి సర్పంచ్ కుప్పాల మురళిని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ దుశ్శాలువతో సన్మానించారు. ఈనెల 3వ తేదీన రాష్ట్ర సర్పంచ్‌ల సదస్సును దిగ్విజయంగా నిర్వహించినందుకు గాను ఆయనను సన్మానించినట్లు తెలిపారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ: టీడీపీ

నగరి, జనవరి 24: చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని వీకేఆర్‌పురంలో బుధవారం బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వస్తే చేపట్టే అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్నెప్ప, రమేష్‌రెడ్డి, ఆకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న గంధమనేని

శ్రీరంగరాజపురం, జనవరి 24: వైసీపీ ప్రభుత్వ అధికారంలో వున్న నాలుగున్నరేళ్లల్లో దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేసిన పాపాన పోలేదని మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. బుధవారం వేణుగోపాలపురంలో బాబు ష్యూరిటీ... భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ మాధవన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, డేటా అనాలసిస్ట్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత ఉండాలి

పాలసముద్రం, జనవరి 24: మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పారదర్శకత ఉండాలని ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో 200 మంది కూలీలు రోజూ పనులకు వచ్చేటట్లు చూడాలన్నారు. ఉపాధి పనులు నాణ్యతతో చేయించాలని, అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మార్గరెట్, ఈసీ అనూష, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ



వెదురుకుప్పం, జనవరి 24: వెదురుకుప్పం మండలం చవటగుంట ఆవు దేవర నందీశ్వర దేవస్థాన ఆవరణంలో బుధవారం శాస్త్రోక్తంగా దక్షణ మూర్తి, చెండకేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, యజ్ఞ యాగాది కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయదారులు, కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు


సరిహద్దులో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు

నగరి, జనవరి 24: తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 16 వ తేదీన జరుగుతాయంటూ ఎన్నికల సంఘం ప్రతిపాదిత తేదీని ప్రకటించడం, మన రాష్ట్రంలోనూ ఎన్నికలు సమీపిస్తుండటంతో సరిహద్దులో బుధవారం ఇరు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. తిరువళ్లూరు జిల్లా, చిత్తూరు జిల్లాల ఎస్పీల ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్, తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ తమిళవారన్ ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు పొన్‌పాడి వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

● పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్


జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 24: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బీసీలకు సముచిత స్థానం దక్కుతుందని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. బుధవారం బంగారుపాళ్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని బీసీలందరూ పెద్దఎత్తున హాజరయ్యారు. బీసీలు పసుపు జెండా చేతబట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ మండలంలో 100 కి.మీ. పూర్తి చేసిన స్థలం వద్ద సభను ఏర్పాటుచేశారు. మురళీమోహన్, మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌లు మాట్లాడుతూ ఆదరణ పథకం కింద చేతివృత్తుల వారికి పనిముట్లు పంపిణీ చేసిన ఘనత టీడీపీదని, వైసీపీ ప్రభుత్వం ఆ పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. రాజకీయ రిజర్వేషన్ 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని, రిజర్వేషన్లు తగ్గించడంతో బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. చిత్తూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జనసేన పార్టీ అధ్యక్షుడు కోడి చంద్రయ్య, కలుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ మహేంద్ర, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జానకిరామ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, నాయకులు నాగరాజ్ గౌడ్, జనార్దన్ గౌడ్, వి.జి. చంద్రశేఖర్, హరిప్రసాద్, రమేష్, లోకనాథ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, హేమచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీల జీవితాలను నాశనం చేసిన జగన్

ఐరాల: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీల జీవితాలను సర్వనాశనం చేశారని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ విమర్శించారు. బుధవారం మండలంలోని నాంపల్లెలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీల అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలతో చంద్రబాబు, జ్యోతిరావ్ పూలే ఆశయాలతో పవన్‌కల్యాణ్ నడుస్తున్నారని, వీరిద్దరి కలయికతో ఏపీకి స్వర్ణ యుగం వస్తుందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ చేస్తున్న జయహో బీసీ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, పరిశీలకులు శ్రీధర్, జయహో బీసీ కమిటీ సభ్యులు మునిరాజ, మణిగోపాల్ యాదవ్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీప్రసాద్, ఎల్బీ. బాల, ధరణి ప్రకాష్, శివ, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


మురళీమోహన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

దేవాలయ భూములనూ వదలట్లేదు

● సర్వే నెంబర్లు మార్చి అమ్మేస్తున్న వైసీపీ నేతలు


సర్వే చేస్తుండగా గుమికూడిన ప్రజలు

పెనుమూరు, జనవరి 24: పెనుమూరులో వైసీపీ నాయకుల భూకబ్జాలకు అంతూ అదుపులేకుండా పోతుంది. కోట్లు విలువచేసే భూములను కబ్జాలు చేయడం.. రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్లో వాటి నెంబర్లు మార్చి అమ్మేయడం.. ఇలా పెనుమూరు మండల కేంద్రంలోనే సుమారు రూ.6 కోట్ల విలువ చేసే భూమిని మింగేశారని రెవెన్యూ అధికారులను కొంతమంది ఆశ్రయించారు. పెనుమూరు-నేంద్రగుంట మార్గంలో రోడ్డుకు ఆనుకొని సర్వే నెంబరు 425-2లో 0.45 ఎకరాలు అక్కగార్లు దేవాలయ భూమి ఉంది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ భూమిని కొందరు ఆ పార్టీ చోటా నాయకులు కలిసి అందులో సర్వే నెంబర్లు మార్చి 0.23 ఎకరాలు అమ్మేశారని ఆ గుడి ధర్మకర్త మోరీసు కుటుంబీకులు తహసీల్దారుకు ఫిర్యాదు చేసి సర్వే చేయాలని కోరారు. దీంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు చూపారు. సర్వే చేస్తున్న సమయంలో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకోవడం గమనార్హం. ఇప్పుడు ఆ భూమిలో కొందరు ఇది తమ స్థలమని రాతికూసాలు కూడా నాటారు. సుమారు 20 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడిద్దాం

● టీడీపీ, జనసేన నేతల పిలుపు


రా.. కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 24: కలసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడిద్దామని టీడీపీ, జనసేన నేతలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 8వ డివిజన్ వెంగళరావు కాలనీ, 9వ డివిజన్ భరత్ నగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ప్రజా శ్రేయస్సును విస్మరించారని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం టీడీపీ ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి, కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్రకుమార్, సీఆర్ రాజన్, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, కాజూరు బాలాజి, డీకే బద్రినారాయణ, కోదండయాదవ్, మోహన్‌రాజ్, త్యాగరాజన్, దుర్గాచౌదరి, రాజశేఖర్, శశికర్ బాబు, ఈశ్వర్, రాణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి

వెదురుకుప్పం, జనవరి 24: ఈ ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించిన వెదురుకుప్పం మండలంలో 41 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం వెదురుకుప్పం మండలంలో పలు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను తహసీల్దార్ డి.లక్ష్మీనారాయణ, ఎంఈవోలు దామోదరం, మహేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈఈ ఎంజీ మురళీతో కలసి పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఎక్కడైనా వసతులు కొరవడితే అక్కడి సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

184వ రోజు అన్నదానం

గుడిపాల, జనవరి 24: మండలంలోని అన్నాక్యాంటీన్‌లో 184వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో శివగంగ బిల్డర్స్ యజమాని లంకపల్లి రవి నాయుడు భోజనం వితరణ చేశారు.

విజయవంతంగా 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ సచీంద్ర కుమార్ పట్నాయక్, వడ్రాంపల్లెలో బహుమతుల పంపిణీ, అగరమంగళంలో అధికారులకు సన్మానం

● జిల్లా ప్రత్యేక అధికారి సచీంద్ర కుమార్ పట్నానాయక్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల గూర్చి ప్రజలకు వివరించేందుకు చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించటంలో జిల్లా అధికారుల సహకారం మరువలేనిదని ఈ కార్యక్రమ స్పెషలాఫీసర్ సచీంద్ర కుమార్ పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి సంబంధించిన జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమానికి స్పెషలాఫీసర్ సచీంద్ర కుమార్ పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 646 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ మిగిలిన 51 గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోగా సంకల్పయాత్రను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, కార్యక్రమ నోడల్ ఆఫీసర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డితో పాటు వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను గుర్తించడమే లక్ష్యం

ఐరాల: అర్హత ఉండి లబ్ధి పొందని లబ్ధిదారులను గుర్తించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా ప్రత్యేక అధికారి సచీంద్ర కుమార్ పట్నానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వడ్రాంపల్లెలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలపై వికసిత్ భారత్ విస్తృత ప్రచారం చేస్తోందన్నారు. ఈ సంకల్ప యాత్రను జిల్లాలో అధికారులు సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పథకాల లబ్ధి పొందని వారిని గుర్తించాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో మూడు సార్లు పర్యటించినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. నోడల్ అధికారి ప్రభాకరరెడ్డి, పీడీలు తులసి, పద్మనాభం, డీడీ రాజ్యలక్ష్మీ, డీపీవో లక్ష్మీ, డీఎస్‌వో శంకరన్, అధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్, హరీష్, సుదర్శన్, షణ్ముగం, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో నాగరాజు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో...

గంగాధరనెల్లూరు: కేంద్రం ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అనేది తెలుసుకోవడానికే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్, జిల్లా బీజేపీ ప్రధానకార్యదర్శి అట్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం పంచాయతీ ఉప సర్పంచ్ వెంకటేశులు అధ్యక్షతన వికసిత్ భారత్ సమావేశం బుధవారం జరిగింది. అధికారులు కేంద్రప్రభుత్వం ద్వారా మంజూరవుతున్న పథకాల గురించి వివరించారు. అనంతరం అధికారులను, బీజేపీ నేతలతో కలిసి ఇడగట్టి సుధాకర్ శాలువలతో సన్మానించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, ఈవోపీఆర్‌డీ రాఘవేంద్రరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు మురళి, జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి సుందరరాజు, నేతలు దొరబాబు, సందీప్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ప్రారంభం

గంగాధరనెల్లూరు, జనవరి 24: గంగాధరనెల్లూరు హైస్కూల్లో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను బుధవారం అధికారులు, నేతలతో కలిసి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి.శ్రీదేవి ప్రారంభించారు. పురుషులు, మహిళల వాలీబాల్ పోటీలలో గంగాధరనెల్లూరు మండలం జట్లు గెలుపొందాయి. ఖోఖోలో కార్వేటినగరం పురుషుల జట్టు, పాలసముద్రం మహిళల జట్టు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, సర్పంచ్ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, మండల స్పెషల్ ఆఫీసర్ విద్యాసాగర్, ఈవోపీఆర్‌డీ రాఘవేంద్రరాజు, పీడీలు, సచివాలయ ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

● సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్



విద్యార్థినికి నగదు చెక్కు అందజేస్తున్న జడ్జి కరుణకుమార్ తదితరులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 24: నేటి బాలికలే రేపటి తల్లులని, సమాజంలో బాలురతో పాటు బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరుణకుమార్ మాట్లాడుతూ బాల్యవివాహాల పట్ల తల్లిదండ్రులకు, సమాజానికి అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఆడబిడ్డల అభ్యున్నతిపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులను చెక్కుల రూపంలో అందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి రవిరాజు, లీగల్ అధికారి ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ● స్థానిక కేజీబీవీ పురపాలిక బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ బాలికల విద్య, సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నగరిలో...

నగరి: బాలికల పట్ల గౌరవ భావంతో మెలగాలని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలోని మహిళాసాధికారిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ బాలికలు మగవారికి దీటుగా అన్ని రంగాలలో పోటీ పడుతున్నారని తెలిపారు. రక్షణ, అంతరిక్షం, సాఫ్ట్‌వేర్, విద్య, వైద్యం, క్రీడలు అన్ని రంగాలలో మహిళలు ముందుకు తీసుకెళుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ రాజు, రేవతి, చిన్నపాపమ్మ, స్వాతి, ఉమామహేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.